# అధ్యాయం 2 ఆర్థిక నిర్వహణ, బడ్జెటు సంబంధిత నియంత్రణలు

## 2.1 పరిచయం

విధాన నిర్ణాయక స్థాయిలో తీసుకున్న నిర్ణయాలను, దుబారా ఖర్చులు లేకుండానూ, నిధుల మళ్లింపులు జరగకుండానూ పరిపాలక స్థాయిలో అమలయ్యేలా చూడడానికి ప్రభావవంతమైన ఆర్థిక నిర్వహణ ఉండాలి. అంతేకాకుండా, విధాన నిర్ణయం క్షేత్రస్థాయిలో విజయవంతంగా అమలుకావడానికి తగిన భరోసాను కూడా ప్రభావవంతమైన ఆర్థిక నిర్వహణ కల్పిస్తుంది. బడ్జెటు ప్రక్రియల్లోని పారదర్శకత, వాటి ప్రభావాలతో పాటు, బడ్జెటు కేటాయింపుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వపు ప్రాథమ్యాలను ఈ అధ్యాయంలో సమీక్షించడం జరిగింది.

## 2.2 బడ్జెటు విషయంలో పారదర్శకత

### *2.2.1 బడ్జెటు చక్రం*

ఆర్థికపరమైన విషయాల్లోనూ, బడ్జెటు సంబంధిత విషయాల్లోనూ పాటించాల్సిన విధానాలను ఆంధ్రప్రదేశ్ ఫైనాన్షియల్ కోడ్, ఆంధ్రప్రదేశ్ బడ్జెటు మాన్యువల్‌లలో పొందుపర్చడం జరిగింది. సాధారణంగా, రాష్ట్రంలో బడ్జెటు రూపకల్పన, దీనికి సంబంధించిన బడ్జెటు క్యాలెండరు ప్రకారమే జరుగుతుంది. ప్రతీ ఏటా అక్టోబరులో తదుపరి ఆర్థిక సంవత్సరానికిగానూ బడ్జెటు అంచనాల రూపకల్పన మొదలవుతుంది. ఐతే, వివిధశాఖలను మేము తనిఖీ చేసినప్పుడు, అతిక్రమణలకు తావులేకుండానూ, ఏడాదిచివర్లో ఆశ్చర్యకర పరిస్థితులు తలెత్తకుండానూ ఉండేలా చూసేందుకు ఆర్థికశాఖకు ఖర్చుల వివరాలను ప్రతీనెలా సమర్పించేలా కేంద్రీకృత వ్యయనియంత్రణ యంత్రాంగం లేదని వెల్లడైంది.

ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ మాన్యువల్ ప్రకారం, బడ్జెటు తయారీ ప్రక్రియలో కిందిస్థాయి నుండి పై స్థాయి వరకూపాల్గొనాలి. అంటే, యూనిటు స్థాయిలో వారికి అవసరమైన నిధుల వివరాలను తెలియజేస్తే, వాటిని జిల్లా స్థాయిలోనూ, తర్వాత సంబంధిత శాఖ స్థాయిలోనూ క్రోడీకరించాలి. ఐతే, ఈ ఏడాది ఆడిటు చేసిన ప్రభుత్వ శాఖల్లో ఈ విధానాన్ని అనుసరిస్తున్న దాఖలాలేవీ కనబడలేదు. ప్రభుత్వ శాఖల్లో అమలవుతున్న వివిధ పథకాలనూ, లావాదేవీలను తనిఖీ చేసినప్పుడు, యూనిటు/జిల్లా స్థాయిలో కానీ సంబంధిత శాఖ స్థాయిలో కానీ ప్రతిపాదిత ఆర్థిక వనరులకూ, వాటి తాలూకు భౌతిక ఫలితాలకూ పొంతన లేదని వెల్లడైంది. వాస్తవంగా కావలసిన నిధుల ఆవశ్యకతను విశ్లేషించడంలోనూ, అంచనా వేయడంలోనూ తగిన కృషి జరగలేదు. ప్రభుత్వం గత మూడేళ్లుగా ఫలితాల బడ్జెటును వెలువరిస్తున్నప్పటికీ, ప్రభుత్వ శాఖలు, ఒక ఏడాదికి నిర్ణయించిన లక్ష్యాలను ఎంతమేరకు సాధించడం జరిగిందో ఆ తర్వాత సంవత్సరానికి సమర్పించే బడ్జెటు ప్రతిపాదనల్లో నివేదించడం లేదు.

## 2.3 ఆర్థికపరమైన జవాబుదారీతనం, బడ్జెటు నిర్వహణ

ప్రతీ ఆర్థిక సంవత్సరంలోనూ, అప్రోప్రియేషన్ చట్టానికి అనుబంధంగా ఉన్న షెడ్యూళ్లలో నిర్దేశించిన వివిధ ప్రయోజనాల కోసం ఓటుచేసిన గ్రాంట్లు, ఛార్జి చేసిన అప్రోప్రియేషన్ల మొత్తాలతో పోల్చి చూసినపుడు, వాస్తవంగా అయిన ప్రభుత్వ ఖర్చుల పద్దులను అప్రోప్రియేషన్ అకౌంట్లు (వినిమయ పద్దులు) అంటారు. తొలి బడ్జెటు అంచనాలు, అనుబంధ గ్రాంట్లు, సరెండర్లు, రీ-అప్రోప్రియేషన్ల మొత్తాలను ఈ అకౌంట్లు స్పష్టంగా తెలుపుతాయి. అప్రోప్రియేషన్ చట్టంలో ఆమోదించిన మొత్తాలకు ప్రతిగా నిర్దేశించిన వివిధ సర్వీసులపై వాస్తవంగా అయిన క్యాపిటల్, రెవెన్యూ ఖర్చుల వివరాలు ఈ పద్దుల్లో ఉంటాయి. ఆర్థిక వనరుల వినియోగం, బడ్జెటు కేటాయింపుల పర్యవేక్షణల గురించి అర్థం చేసుకోవడంలో అప్రోప్రియేషన్ అకౌంట్లు ఉపకరిస్తాయి. ఆ విధంగా, ఇవి ఫైనాన్స్ అకౌంట్లకు (ఆర్థిక పద్దులకు) అనుబంధంగా ఉంటాయి.

వివిధ గ్రాంట్ల కింద వాస్తవంగా చేసిన ఖర్చులు అప్రోప్రియేషన్ చట్టంలో ఆమోదించిన మొత్తాలను అధికమించలేదనీ రాజ్యాంగపు నిబంధనల ప్రకారం ఛార్జ్ చేయాల్సిన విధంగానే ఖర్చులను ఛార్జ్ చేసారనీ నిర్ధారించుకోవడానికి భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ (సి.ఏ.జి.) అప్రోప్రియేషన్ పద్దులను తనిఖీ చేస్తారు. అంతేకాకుండా, చేసిన ఖర్చులు చట్టాలు, సంబంధిత నియమ నిబంధనలు, ఆదేశాలకు అనుగుణంగానే ఉన్నాయా లేవా అని కూడా నిర్ధారించుకోవడం జరుగుతుంది

## 2.4 వినిమయ పద్దుల సంగ్రహం

నలభై గ్రాంట్లు/అప్రోప్రియేషన్లకు సంబంధించి 2010-11లో వాస్తవంగా అయిన ఖర్చుల వివరాలను సంక్షిప్తంగా **పట్టిక 2.1** లో చూపడం జరిగింది.

**పట్టిక 2.1 : తొలి కేటాయింపులు, అనుబంధ కేటాయింపులకు ప్రతిగా వాస్తవంగా అయిన ఖర్చుల సంక్షిప్త స్థితి**

**(₹ కోట్లలో)**

| | ఖర్చుల స్వభావం | | తొలిగ్రాంటు/ అప్రోప్రియేషన్ | అనుబంధ గ్రాంటు/ అప్రోప్రియేషన్ | మొత్తం | వాస్తవంగా అయిన ఖర్చు[1] | మిగులు (-)/ అదనం (+) |
|---|---|---|---|---|---|---|---|
| ఓటు చేసినవి | I | రెవెన్యూ | 77,193 | 8,526 | 85,719 | 69,902 | (-)15,817 |
| | II | క్యాపిటల్ | 14,504 | 500 | 15,004 | 11,425 | (-)3,579 |
| | III | ఋణాలు, అడ్వాన్సులు | 2,490 | 398 | 2,888 | 3,315 | (+)427 |
| **మొత్తం ఓటు చేసినవి** | | | **94,187** | **9,424** | **1,03,611** | **84,642** | **(-)18,969** |
| ఛార్జ్ చేసినవి | IV | రెవెన్యూ | 10,308 | 36 | 10,344 | 9,788 | (-)556 |
| | V | క్యాపిటల్ | 80 | 8 | 88 | 22 | (-)66 |
| | VI | ప్రజా ఋణం తిరిగి చెల్లింపు | 9,733 | -- | 9,733 | 7,881 | (-)1,852 |
| **మొత్తం ఛార్జ్ చేసినవి** | | | **20,121** | **44** | **20,165** | **17,691** | **(-)2,474** |
| **పూర్తి మొత్తం** | | | **1,14,308** | **9,468** | **1,23,776** | **1,02,333** | **(-)21,443** |

**గమనిక :** ఆకస్మిక ఖర్చుల (ఎ.సి.) బిల్లులపై 2010-11 లో డ్రా చేసిన ₹670 కోట్ల మేర మొత్తానికి నియమాల అనుసారం డ్రా చేసి చెల్లింపులు చేసే అధికారుల (డి.డి.ఓ.ల) నుంచి రావల్సిన వివరణాత్మక కంటింజెంట్ (డి.సి.) బిల్లులు అందలేదు. వివరణాత్మక కంటింజెంట్ బిల్లులు లేని కారణంగా ఈ ఖర్చుల యదార్థతను ధ్రువీకరించలేము. మొత్తం ఖర్చును ఆ మేరకు అధికంగా చూపడం జరిగింది.

రెవెన్యూ విభాగం కింద 38 గ్రాంట్లు, 14 అప్రోప్రియేషన్లు, క్యాపిటల్ విభాగం కింద 22 గ్రాంట్లు, రెండు అప్రోప్రియేషన్లు, లోన్లు విభాగం కింద ఎనిమిది గ్రాంట్లు, ఒక అప్రోప్రియేషన్ (ప్రజా ఋణం) లలో ₹ 22,310 కోట్ల మిగులు ఏర్పడింది. ఐతే, రెవెన్యూ విభాగం కింద రెండు గ్రాంట్లు, నాలుగు అప్రోప్రియేషన్లు, క్యాపిటల్ విభాగం కింద నాలుగు గ్రాంట్లు, ఒక అప్రోప్రియేషన్, లోన్లు విభాగం కింద ఐదు గ్రాంట్లలో ₹ 867 కోట్లు అధికంగా ఖర్చయింది. ఫలితంగా ₹ 21,443 కోట్ల నికర మిగులు ఏర్పడింది. ఈ ఏడాది చేసిన అనుబంధ కేటాయింపులకు ఈ మిగుళ్లు 2.26 రెట్లు ఉన్నాయి. బడ్జెటు అంచనాల్లో కచ్చితత్వం లేదనీ, ఖర్చులపై తగినంత పర్యవేక్షణ లేదనీ ఇది సూచిస్తోంది.

[1] ఈ సంఖ్యలు ఖర్చులను స్థూలంగా సూచిస్తాయి. రెవెన్యూ వ్యయం కింద (₹ 1,156 కోట్లు), క్యాపిటల్ వ్యయం కింద (₹ 323 కోట్లు) ఖర్చులో తగ్గుదలగా పద్దులలో సర్దుబాటు చేసిన రికవరీలను వీటిలో పరిగణించలేదు

ఆమోదం పొందిన బడ్జెటునుండి ఆ ఏడాదిలో ఎన్ని అతిక్రమణలు జరిగాయి, అనుబంధ గ్రాంట్లు, రీ-అప్రోప్రియేషన్లు ఏ మేరకు ఉన్నాయి, చివరకు ఎంతమేర అధిక ఖర్చు లేదా మిగులు జరిగిందనే విషయాలపై ఆ బడ్జెటు-విశ్వసనీయత ఆధారపడి ఉంటుంది. నిధుల లభ్యత లేకుండానే ఖర్చుచేసేసిన కేసులు, సంబంధిత అధికారి నుండి ఆమోదం పొందకుండానే ఖర్చుచేసిన పలు కేసులను ప్రతీ ఏడాదీ సిఏజి తన ఆడిట్ నివేదికలలో వెల్లడించడం జరుగుతోంది.

### *2.4.1 కేటాయింపుల ప్రాథమ్యాలకనుగుణంగా వినియయం*

2010-11 ఆర్థిక సంవత్సరంలో, రాబడులు, ఖర్చులు రెండింటి విషయంలోనూ బడ్జెటు ప్రతిపాదనలతో వైరుధ్యం కల్గింది. ఇది బడ్జెటు ప్రక్రియ, బడ్జెటుపై పర్యవేక్షణ ప్రక్రియ, సమాచార నిర్వహణ వ్యవస్థల విశ్వసనీయతపై సందేహాలకు తావిస్తోంది.

మేము చేసిన వినిమయ పద్దుల తనిఖీలో, 18 కేసుల్లో, ఒక్కొక్క కేసులోనూ ₹ 100 కోట్ల కంటే అధికంగానూ, మొత్తం కేటాయింపుల్లో 20 శాతం కంటే అధికంగానూ మిగుళ్లేర్పడ్డాయని వెల్లడైంది. మొత్తం ₹ 22,310 కోట్లలో ఇవి 60 శాతంగా ఉన్నాయి ***(అనుబంధం 2.1)***. ఇందులో నాలుగు గ్రాంట్లలోనే ₹ 7,363 కోట్ల మిగులు (33 శాతం) ఏర్పడింది. ఈ వివరాలు **పట్టిక 2.2** లో ఉన్నాయి.

**పట్టిక 2.2 : అధికంగా మిగుళ్లు ఏర్పడిన గ్రాంట్లు**

**(₹ కోట్లలో)**

| క్రమ సంఖ్య | గ్రాంటు సంఖ్య, పేరు | తొలి గ్రాంటు | అనుబంధ గ్రాంటు | మొత్తం | వాస్తవంగా అయిన ఖర్చు | మిగులు |
|---|---|---|---|---|---|---|
| | రెవెన్యూ - ఓటు చేసింది | | | | | |
| **1.** | XVII - మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి | 3,627 | 347 | 3,974 | 2,592 | 1,382 |
| **2.** | XXV - స్త్రీ, శిశు, వికలాంగుల సంక్షేమం | 1,768 | 4 | 1,772 | 971 | 801 |
| **3.** | XXXIII - భారీ, మధ్యతరహా నీటిపారుదల | 10,675 | 0 | 10,675 | 6,333 | 4,342 |
| | మొత్తం | | | | | **6,525** |
| | క్యాపిటల్ - ఓటు చేసింది | | | | | |
| **4.** | XXXIV - చిన్నతరహా నీటిపారుదల | 1,631 | 0 | 1,631 | 793 | 838 |
| | మొత్తం | | | | | **838** |
| | పూర్తి మొత్తం | | | | | **7,363** |

మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి గ్రాంటు కింద ఏర్పడిన మిగులులో ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ పట్టణ సంస్కరణలు - మున్సిపల్ సేవలు, జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పట్టణ నవీకరణ పథకం కింద పట్టణ మౌలిక వసతులు, పాలన, పురపాలక సంఘాలకు ఆర్థిక సాయం అనే అంశాల్లో మిగుళ్లేర్పడ్డాయి. స్త్రీ, శిశు, వికలాంగుల సంక్షేమం గ్రాంటు కింద ప్రధానంగా పోషకాహార కార్యక్రమం, సమీకృత శిశు అభివృద్ధి సేవల పథకం కింద మిగులు ఏర్పడింది. మిగుళ్లకు గల నిర్దిష్ట కారణాలేవీ ప్రభుత్వం తెలియజేయలేదు.

ఖర్చును క్యాపిటల్ ఖర్చుగా పరిగణించడం వలన క్యాపిటల్ పద్దు కింద అదనపు మొత్తాలను కేటాయించడం కోసం రెవెన్యూ పద్దు కిందనే ఆ మొత్తాలను ఉంచడమే భారీ, మధ్యతరహా నీటిపారుదల గ్రాంటు కింద మిగులు ఏర్పడ్డానికి ప్రధాన కారణమని ప్రభుత్వం తెలిపింది. చిన్నతరహా నీటిపారుదల కింద ప్రధానంగా, ఎత్తిపోతల నీటిపారుదల పనులు, చిన్నతరహా నీటిపారుదల వనరుల నిర్మాణం - పునరుద్ధరణల కింద మిగులు ఏర్పడింది. ఐతే, మిగుళ్లకు గల కారణాలను ప్రభుత్వం తెలుపలేదు (2011 ఆగస్టు).

### 2.4.2 నిరంతరం మిగుళ్లేర్పడటం

ఎనిమిది కేసుల్లో గత ఐదేళ్లలో ప్రతీ కేసులోనూ ₹ 20 కోట్ల కంటే ఎక్కువగానూ, మొత్తం గ్రాంటు/అప్రోప్రియేషన్‌లో 20 శాతం లేదా అంతకంటే ఎక్కువగా మిగుళ్లేర్పడ్డాయి. వివరాలను ఈ కింది **పట్టిక 2.3** లో చూపడం జరిగింది :

**పట్టిక 2.3 : 2006-11 మధ్యకాలంలో నిరంతరంగా మిగుళ్లేర్పడిన గ్రాంట్లు, అప్రోప్రియేషన్లు**

**(₹ కోట్లలో)**

| క్రమ సంఖ్య | గ్రాంటు/అప్రోప్రియేషన్ సంఖ్య, పేరు | మిగుళ్ల మొత్తం | | | | |
|---|---|---|---|---|---|---|
| | | 2006-07 | 2007-08 | 2008-09 | 2009-10 | 2010-11 |
| | రెవెన్యూ - ఓటు చేసింది | | | | | |
| 1. | XVIII - గృహ నిర్మాణం | 407 | 342 | 802 | 374 | **189** |
| 2. | XXXVI - పరిశ్రమలు, వాణిజ్య | 152 | 165 | 288 | 582 | **389** |
| 3. | XXXVII - పర్యాటకం, కళలు, సంస్కృతి | 66 | 74 | 55 | 38 | **41** |
| | క్యాపిటల్ - ఓటు చేసింది | | | | | |
| 4. | V - రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, పునరావాసం | 37 | 37 | 60 | 23 | **101** |
| 5. | XII - పాఠశాల విద్య | 71 | 112 | 164 | 107 | **327** |
| 6. | XXI - సాంఘిక సంక్షేమం | 176 | 109 | 434 | 102 | **75** |
| | క్యాపిటల్ - ఛార్జి చేసింది | | | | | |
| 7. | XXXIII - భారీ, మధ్యతరహా నీటిపారుదల | 52 | 69 | 112 | 97 | **56** |
| | లోన్లు - ఛార్జి చేసింది | | | | | |
| 8. | **IX - ద్రవ్యపాలన, ప్రణాళిక, సర్వేలు, గణాంకాలు** | **2,574** | **2,757** | **2,663** | **1,807** | **1,852** |

పైన పేర్కొన్న గ్రాంట్లు/అప్రోప్రియేషన్లు విద్య, సంక్షేమం, నీటిపారుదల రంగాల్లో అభివృద్ధి పథకాలకు సంబంధించినవి కాబట్టి ప్రభుత్వం లక్షిత లబ్ధిదార్లకు ఆశించిన ఫలితాలనందించలేకపోయిందని స్పష్టమవుతోంది.

గృహ నిర్మాణం కింద ప్రధానంగా, 'ఇందిరమ్మ పథకం కింద బలహీన వర్గాల గృహ నిర్మాణ కార్యక్రమం' కింద నిరంతరం మిగుళ్లేర్పడుతున్నాయి. మిగుళ్లకు కారణాలను ప్రభుత్వం తెలుపలేదు (2011 ఆగస్టు).

కేంద్రప్రభుత్వం తన వాటాను విడుదల చేయకపోవడం, కొనుగోలు పన్ను ప్రోత్సాహకం - రీయింబర్స్‌మెంట్ కోసం నిధుల అవసరం లేకపోవడం, వైమానిక ఇంధనం పై అమ్మకం పన్ను (వ్యాట్) రీయింబర్స్‌మెంట్ కోసం రవాణా, రోడ్లు, భవనాల శాఖ కింద చేసిన కేటాయింపులను వినియోగించుకోకపోవడం - పరిశ్రమలు - వాణిజ్యం గ్రాంటు కింద మిగుళ్లకు ప్రధాన కారణాలుగా తెలిపారు. నేత కార్మికులకు రుణమాఫీకోసం సహాయం, పారిశ్రామికాభివృద్ధికి ప్రోత్సాహకాల కింద మిగుళ్లకు నిర్దిష్ట కారణాలను ప్రభుత్వం తెలియచేయలేదు (ఆగస్టు 2011).

కార్యాచరణ ప్రణాళిక అమలుకాకపోవడం, పరిపాలనా మంజూరీ రాకపోవడం, పురావస్తు సంరక్షణకు సంబంధించిన టెండర్ల ప్రక్రియలో జాప్యం జరగడం, కడప, నెల్లూరులలో బహుళ ప్రయోజనాల సాంస్కృతిక సముదాయాల నిర్మాణం జరగకపోవడం మొదలైనవి - పర్యాటకం, కళలు, సంస్కృతి, గ్రాంటు కింద మిగుళ్లకు కారణాలు. తుఫాను ప్రమాద ఉపశమనానికి సంబంధించిన జాతీయ పథకం కింద భవనాలు, వంతెనలు, తుఫాను షెల్టర్లు, రోడ్ల నిర్మాణం జరగకపోవడం, నిర్మాణపు పనులను చేపట్టకపోవడం వలన రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, పునరావాసం గ్రాంటు కింద మిగుళ్లేర్పడ్డాయి.

పాఠశాల విద్య గ్రాంటులో ప్రధానంగా 'భవనాల నిర్మాణం', 'వంట గది - స్టోర్సు గదులకు భవనాలు' కింద మిగుళ్ళేర్పడ్డాయి. అంతేకాకుండా, సాంఘిక సంక్షేమం గ్రాంటులో ప్రధానంగా 'రెసిడెన్షియల్ పాఠశాల సముదాయాలకు భవనాల నిర్మాణం', 'సమీకృత వసతి గృహాలు/పాఠశాలలు', వగైరాల కింద మిగుళ్ళేర్పడ్డాయి. మిగుళ్ళేర్పడడానికి గల నిర్దిష్ట కారణాలను ప్రభుత్వం తెలుపలేదు (2011 ఆగస్టు).

భారీ, మధ్యతరహా నీటిపారుదల (క్యాపిటల్ - ఛార్జి చేసిన విభాగం), ద్రవ్య పరిపాలన, ప్రణాళిక, సర్వేలు, గణాంకాలు (లోన్లు - ఛార్జి చేసిన విభాగం) కింద మిగుళ్ళేర్పడడానికి గల కారణాలను ప్రభుత్వం తెలుపలేదు (2011 ఆగస్టు).

### *2.4.3 అధిక ఖర్చు*

ఒక అప్రోప్రియేషన్, పదకొండు గ్రాంట్లలో బడ్జెటు కేటాయింపులను మించి ₹ 867 కోట్ల మేర అధికంగా ఖర్చయ్యింది. భారత రాజ్యాంగంలోని 205 వ అధికరణం ప్రకారం ఈ ఖర్చును క్రమబద్ధీకరించాల్సి ఉంది.

ఐదు కేసుల్లో, ప్రతీ కేసులోనూ కేటాయించిన నిధుల కంటే ₹ 10 కోట్లు లేదా అంతకంటే అధికంగా ఖర్చు జరిగింది. ఈ ఐదు కేసుల్లోనూ, బడ్జెటు కేటాయింపులను మించి ₹ 842 కోట్లు అధికంగా ఖర్చయ్యింది. ఆ వివరాలు ఈ కింది **పట్టిక 2.4** లో ఉన్నాయి.

**పట్టిక 2.4 : అధిక చెల్లింపులు**

**(₹ కోట్లలో)**

| క్రమ సంఖ్య | గ్రాంటు సంఖ్య | గ్రాంటు పేరు | మొత్తం గ్రాంటు | ఖర్చు | అధిక ఖర్చు |
|---|---|---|---|---|---|
| 1. | X | హోం పరిపాలన (రెవెన్యూ - ఓటు చేసింది) | 3,590 | 3,841 | 251 |
| 2. | XI | రోడ్లు, భవనాలు, పోర్టులు (లోన్లు - ఓటు చేసింది) | 75 | 104 | 29 |
| 3. | XVII | మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి (లోన్లు - ఓటు చేసింది) | 946 | 1,460 | 514 |
| 4. | XXVII | వ్యవసాయం (క్యాపిటల్ - ఓటు చేసింది) | 1 | 12 | 11 |
| 5. | XXXV | ఇంధనం (లోన్లు - ఓటు చేసింది) | 457 | 494 | 37 |
| | | **మొత్తం** | **5,069** | **5,911** | **842** |

హోం పరిపాలన గ్రాంటు రెవెన్యూ విభాగం కింద అధిక ఖర్చుకు ప్రధాన కారణం వేతన సవరణ సంఘం - 2010 సిఫార్సులను అమలు చేయడం. పట్టిక 2.4 లో ప్రస్తావించిన మిగతా గ్రాంట్ల కింద అయిన అధిక ఖర్చుకు ప్రభుత్వం నిర్దిష్ట కారణాలను తెలపలేదు (2011 ఆగస్టు)

### *2.4.4 కేటాయింపులు లేకుండా ఖర్చు చేయడం*

బడ్జెటు మాన్యువల్‌లోని పేరా 20.3.1 ప్రకారం, సాధారణంగా, నిధుల కేటాయింపు జరగకుండా ఏదైనా పథకం/సేవపై ఖర్చు చేయకూడదు. ఐతే, తొలి అంచనాలు/అనుబంధ డిమాండ్లలో కేటాయింపులు లేకుండానే తొమ్మిది కేసుల్లో మొత్తం ₹ 810 కోట్లు (ఒక్కొక్క కేసులోనూ ₹ 10 కోట్ల కంటే అధికంగా) ఖర్చు చేసారు. వివరాలు **పట్టిక 2.5** లో ఉన్నాయి.

పట్టిక 2.5 : 2010-11 లో కేటాయింపులు లేకుండానే చేసిన ఖర్చులు

(₹ కోట్లలో)

| క్రమ సంఖ్య | గ్రాంటు సంఖ్య, పేరు | పద్దు | ఖర్చు | కారణాలు |
|---|---|---|---|---|
| 1. | IX - ఆర్థిక పరిపాలన, ప్రణాళిక, సర్వేలు, గణాంకాలు | 2070-003-04-12 | 20 | 13వ ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం, 'అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా' లో 'సెంటర్ ఫర్ ఇన్నోవేషన్' స్థాపన కోసం. |
| 2. | | 2071-01-110-09 | 12 | పింఛనుదార్లకు పి.ఆర్.సి. 2010 సిఫార్సులను అమలు చేయడం వలన. |
| 3. | | 3454-01-800-05 | 86 | కారణాలను తెలుపలేదు. |
| 4. | XI - రోడ్లు, భవనాలు, పోర్టులు | 3054-04-797-04 | 162 | కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చిన మొత్తాలను 'రోడ్డు నిధి' కి బదిలీ చేసేందుకు బడ్జెట్లో నిధులను కేటాయించకపోవడం వలన. |
| 5. | XXXIII - భారీ, మధ్యతరహా నీటిపారుదల | 4701-01-101 | 114 | కారణాలను తెలుపలేదు. |
| 6. | | 4701-01-129 | 87 | |
| 7. | XXXV - ఇంధనం | 6801-202-01 | 250 | ప్రస్తుత సంవత్సరంలో వర్గీకరణను మార్చడం వలన |
| 8. | | 6801-789-01 | 56 | |
| 9. | | 6801-796-01 | 23 | |
| | **మొత్తం** | | **810** | |

### *2.4.5 గత సంవత్సరాల్లో కేటాయింపులను మించి చేసిన ఖర్చుల్లో ఇంకా క్రమబద్ధీకరించాల్సినవి*

భారత రాజ్యాంగంలోని 205 వ అధికరణం ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వం ఒక గ్రాంటు/అప్రోప్రియేషన్ కంటే అధికంగా చేసిన ఖర్చును ఆ రాష్ట్ర శాసన సభ ద్వారా తప్పనిసరిగా క్రమబద్ధీకరించుకోవాలి. ఈ అధికరణం కింద ఖర్చును క్రమబద్ధీకరించు కోవడానికి ఎటువంటి గడువునూ నిర్దేశించకపోయినప్పటికీ, ప్రజా పద్దుల సంఘం (పి.ఎ.సి.) ద్వారా అప్రోప్రియేషన్ అకౌంట్లపై చర్చ పూర్తయిన తరువాత అధిక ఖర్చులను క్రమబద్ధీకరించడం జరుగుతుంది. ఐతే, 2004-10 మధ్యగల కాలానికి సంబంధించిన మొత్తం ₹ 1,819.65 కోట్ల అధిక ఖర్చును ఇంకా క్రమబద్ధీకరించాల్సి ఉంది. వివరాలు ***అనుబంధం 2.2*** లో ఉన్నాయి. సంవత్సరాల వారిగా ఆయా గ్రాంట్లు/అప్రోప్రియేషన్ల కింద క్రమబద్ధీకరించని అధిక ఖర్చుల వివరాలను **పట్టిక 2.6** లో సంక్షిప్తంగా పేర్కొనడం జరిగింది.

పట్టిక 2.6 : గత సంవత్సరాలలో కేటాయింపుల కంటే అధికంగా చేసిన ఖర్చుల్లో క్రమబద్ధీకరించాల్సి ఉన్నవి

(₹ కోట్లలో)

| సంవత్సరం | సంఖ్య | | కేటాయింపు కంటే అధికంగా చేసిన ఖర్చు | క్రమబద్ధీకరణ విషయంలో ప్రస్తుత స్థితి |
|---|---|---|---|---|
| | గ్రాంట్లు | అప్రోప్రియేషన్లు | | |
| 2004-05 | 5 | 1 | 15 | ఈ 50 గ్రాంట్లు, 13 అప్రోప్రియేషన్లకుగాను, 2011 జూన్ నాటికి, 9 గ్రాంట్లు, 5 అప్రోప్రియేషన్లకు సంబంధించి వివరణాత్మక నివేదికలు అందాయి. అకౌంటెంట్ జనరల్ ద్వారా వాటి పరిశీలన కూడా పూర్తయింది. మిగతా 41 గ్రాంట్లు, 8 అప్రోప్రియేషన్ల విషయంలో, అకౌంటెంట్ జనరల్ పరిశీలన కోసం సంబంధిత పరిపాలనా శాఖలు/ఆర్థిక శాఖ నుండి వివరణాత్మక నివేదికలు రావలసి ఉంది. |
| 2005-06 | 10 | 3 | 586 | |
| 2006-07 | 7 | 1 | 199 | |
| 2007-08 | 7 | 3 | 201 | |
| 2008-09 | 11 | 3 | 709 | |
| 2009-10 | 10 | 2 | 110 | |
| **మొత్తం** | **50** | **13** | **1,820** | |

### *2.4.6 అనవసరపు/అధిక/చాలినంతగా లేని అనుబంధ కేటాయింపులు*

ఈ సంవత్సరం 21 కేసుల్లో, ప్రతి కేసులోనూ కోటి రూపాయలు లేదా అంతకంటే అధికంగా చేసిన అనుబంధ కేటాయింపులు అనవసరమని తేలింది. తొలుత కేటాయించిన నిధులే పూర్తిగా ఖర్చు కాకపోవడం వలన ఈ కేసుల్లో చేసిన మొత్తం ₹ 1,588 కోట్ల అనుబంధ కేటాయింపులూ అనవసరమని తెలుస్తోంది. వివరాలు ***అనుబంధం 2.3(ఎ)*** లో ఉన్నాయి. మున్సిపల్ పరిపాలన - పట్టణాభివృద్ధి, సాంఘిక సంక్షేమం, వైద్యం - ఆరోగ్యం, గిరిజన సంక్షేమం, రోడ్లు - భవనాలు - పోర్టులకు సంబంధించి అయిన ఖర్చు తొలి కేటాయింపు కంటే కూడా తక్కువగా ఉండటం వలన వీటికి భారీగా ఇచ్చిన అనుబంధ కేటాయింపులు అనవసరమైనవని తేలింది.

ఒక అప్రోప్రియేషన్, 16 గ్రాంట్లకు సంబంధించి ₹ 3,194 కోట్ల కేటాయింపులు అవసరం కాగా, ₹ 7,183 కోట్ల అనుబంధ కేటాయింపులు చేసారు. ఫలితంగా, ₹ 3,989 కోట్ల కేటాయింపులు (ప్రతి కేసులోనూ కోటి రూపాయలు లేదా అంతకంటే ఎక్కువ) అధికమని తేలింది. వివరాలు ***అనుబంధం 2.3 (బి)*** లో ఉన్నాయి. ఎనిమిది కేసులలో మొత్తం ₹ 647 కోట్ల అనుబంధ కేటాయింపులు చేసినప్పటికీ, ఈ అనుబంధ కేటాయింపులు కూడా సరిపోకపోవడంతో కేటాయింపులను మించి ₹ 809 కోట్ల అధిక ఖర్చు నమోదయ్యింది. ఇందులో ప్రతి కేసులోనూ కొరత కోటి రూపాయలకు మించే ఉంది. వివరాలు ***అనుబంధం 2.3(సి)*** లో ఉన్నాయి.

### *2.4.7 అధికంగా/అనవసరంగా చేసిన నిధుల పునః కేటాయింపులు*

ఏదైనా ఒక గ్రాంటులో, ఒక అంశంలో మిగులుతాయని ముందుగానే ఊహించిన నిధులను అదే గ్రాంటులో అదనపు నిధులు అవసరమైన మరో అంశానికి బదిలీ చేయడాన్ని పునః కేటాయింపు (రీ-అప్రోప్రియేషన్) అంటారు. ఈ ఏడాది 92 కేసులలో, రీ-అప్రోప్రియేషను జరిగిన తర్వాత కూడా ప్రతి కేసులోనూ ₹ 10 కోట్లు, అంతకంటే ఎక్కువగా నిధులు వినియోగం కాకుండా మిగిలిపోవడం లేదా కేటాయింపులను మించి ఖర్చు కావడం జరిగింది. కాబట్టి ఈ కేసులలో చేసిన రీ-అప్రోప్రియేషన్లు అధికంగా ఉండడం లేదా అనవసరమైనవి అని తెలుస్తుంది ***(అనుబంధం 2.4).***

### *2.4.8 వివరణలు లేని పునః కేటాయింపులు*

ఆంధ్రప్రదేశ్ బడ్జెటు మాన్యువల్ లోని పేరా 20.17.2 ప్రకారం, అదనపు ఖర్చు లేదా మిగులుకు గల కారణాలను రీ-అప్రోప్రియేషన్ స్టేట్‌మెంట్లలో వివరించాల్సి ఉంది. "తొలి కేటాయింపు సరిపడా లేదని లేదా అధికంగా ఉందని తేలింది", "వాస్తవ ఖర్చుల పురోగతి ఆధారంగా" లాంటి అస్పష్టమైన కారణాలను తెలుపకూడదు. ఐతే, ఆర్థిక శాఖ జారీ చేసిన పునః కేటాయింపుల ఆదేశాలను పరిశీలించగా, మొత్తం 7,671 అంశాల్లో రీ-అప్రోప్రియేషన్లు జరిగితే, 3,446 అంశాల్లో మాత్రమే నిర్దిష్ట కారణాలను తెలిపారని వెల్లడైంది.

### *2.4.9 పెద్ద మొత్తంలో నిధులను తిరిగి అప్పగించడం*

110 ఉప పద్దుల విషయంలో, ప్రతీ కేసులోనూ ₹ 10 కోట్ల కంటే అధికంగానూ, మొత్తం కేటాయింపులో 50 శాతం కంటే ఎక్కువ గానూ నిధులను పెద్ద మొత్తంలో తిరిగి అప్పగించడం (సరెండరు చేయడం) జరిగింది. దీనికి ప్రధాన కారణాలు - (i) క్యాపిటల్ ఖర్చుగా పరిగణించిన కేటాయింపులను రెవెన్యూ పద్దు కిందనే ఉంచడం, పనుల పురోగతి తగినంతగా లేకపోవడం, (ii) మంజూరీ ఉత్తర్వులు రాకపోవడం, (iii) ఈ ఏడాది వర్గీకరణలో మార్పు జరగడం, (iv) లోను సెక్షనులో నిధుల కేటాయింపు కోసం క్యాపిటల్ సెక్షను కిందనే కేటాయింపులను ఉంచడం, (v) పనుల పురోగతి నెమ్మదిగా ఉండడం/ పనులు వాయిదా పడడం.

110 ఉప పద్దులలో కేటాయింపుల మొత్తం ₹ 15,707 కోట్లు కాగా, అందులో నుండి ₹ 13,004 కోట్లను (83 శాతం) తిరిగి అప్పగించడం జరిగింది. వీటిలోని 37 ఉప పద్దులలో, నూటికి నూరు శాతం కేటాయింపులను (₹ 3,893 కోట్లను) సరెండరు చేయడం జరిగింది. వంద కోట్ల రూపాయల కంటే ఎక్కువగానూ, కేటాయింపుల్లో 90 శాతానికంటే అధికంగానూ సరెండరు చేసిన కేసుల వివరాలను ***అనుబంధం 2.5*** లో ఇవ్వడమైంది. ప్రభుత్వం కేటాయింపుల ఆవశ్యకతను మరింత వాస్తవికంగా అంచనా వేసి ఉండాల్సింది.

### 2.4.9.1 గంపగుత్తగా నిధులను కేటాయించడం

బడ్జెటు అంచనాల్లో గంపగుత్త కేటాయింపులు చేయకూడదని బడ్జెటు మాన్యువల్‌లోని పేరా 16.12 లో నిర్దేశించినప్పటికీ, ఈ నిర్దేశాలకు విరుద్ధంగా, బడ్జెటు అంచనాల్లో ₹ 2,875 కోట్ల మొత్తాన్ని గంపగుత్తగా కేటాయించారు. ఐతే, ఈ మొత్తం కేటాయింపులో ₹ 2,734 కోట్లు (95 శాతం) వినియోగం కాకుండా మిగిలి పోయాయి. దీనికి సంబంధించిన వివరాలను ఈ కింది **పట్టిక 2.7** లో తెలపడమైంది.

**పట్టిక 2.7 : గంపగుత్త కేటాయింపులు**

(₹ కోట్లలో)

| వరుస సంఖ్య | గ్రాంటు సంఖ్య - పేరు | పద్దు | బడ్జెటు కేటాయింపులు | సరెండరు చేసిన మొత్తం |
|---|---|---|---|---|
| 1 | IX - ద్రవ్య పరిపాలన, ప్రణాళిక, సర్వేలు, గణాంకాలు | 2052-090-75 - గంపగుత్త కేటాయింపు | 2,400 | 2,400 |
| 2 | XI - రోడ్లు, భవనాలు, పోర్టులు | 5054-03-800-36 - పి.పి.పి. ప్రాజెక్టుల కోసం గంపగుత్త కేటాయింపు | 200 | 160 |
| 3 | XII - పాఠశాల విద్య | 2202-01-800-75 - గంపగుత్త కేటాయింపు | 14 | 14 |
| 4 | XIII - ఉన్నత విద్య | 2202-03-001-75 - గంపగుత్త కేటాయింపు | 32 | 32 |
| 5 | | 2202-03-102-41 - యు.జి.సి. వేతన స్కేళ్లకు సంబంధించి తప్పనిసరిగా భరించాల్సిన అదనపు చెల్లింపుల కోసం గంపగుత్త కేటాయింపు (01.01.2006 నుండి 31.03.2010 వరకూ గల కాలానికి సంబంధించిన 20 శాతం బకాయిలు) | 62 | 62 |
| 6 | | 2202-03-102-42 - యు.జి.సి. వేతన స్కేళ్లకు సంబంధించి తప్పనిసరిగా భరించాల్సిన అదనపు చెల్లింపుల కోసం గంపగుత్త కేటాయింపు (01.04.2010 నుండి 31.03.2011 వరకూ గల కాలానికి సంబంధించి తప్పనిసరి చెల్లింపులకు 100 శాతం) | 95 | 1 |
| 7 | | 2202-03-102-75 - గంపగుత్త కేటాయింపు | 43 | 36 |
| 8 | | 2202-03-104-75 - గంపగుత్త కేటాయింపు | 4 | 4 |
| 9 | | 2202-03-789-41 - యు.జి.సి. వేతన స్కేళ్లకు సంబంధించి తప్పనిసరిగా భరించాల్సిన అదనపు చెల్లింపుల కోసం గంపగుత్త కేటాయింపు (01.01.2006 నుండి 31.03.2010 వరకూ గల కాలానికి సంబంధించిన 20 శాతం బకాయిలు) | 13 | 13 |
| 10 | | 2202-03-796-41 - యు.జి.సి. వేతన స్కేళ్లకు సంబంధించి తప్పనిసరిగా భరించాల్సిన అదనపు చెల్లింపుల కోసం గంపగుత్త కేటాయింపు (01.01.2006 నుండి 31.03.2010 వరకూ గల కాలానికి సంబంధించిన 20 శాతం బకాయిలు) | 5 | 5 |
| 11 | XVI - వైద్యం, ఆరోగ్యం | 2210-01-001-75 - గంపగుత్త కేటాయింపు | 7 | 7 |
| | | **మొత్తం** | **2,875** | **2,734** |

పైన పేర్కొన్న వివరాల నుండి, ఐదు గ్రాంట్ల కింద ఉన్న 11 పద్దులకు గానూ 8 పద్దుల్లో కేటాయించిన మొత్తం నిధులు వినియోగం కాలేదు. నాలుగు ఉప పద్దులకు (క్రమ సంఖ్యలు 1, 3, 4, 7) సంబంధించిన కేటాయింపులను ఆర్థిక సంవత్సర చివరి రోజునే సరెండరు చేసారు. ఈ కేసులలో భారీ మొత్తంలో బడ్జెటు కేటాయింపులను సరెండరు చేయడానికి గల కారణాలను ప్రభుత్వం తెలుపలేదు. క్రమ సంఖ్యలు 1, 4, 7, 8, 11 ల విషయంలో ఏ ప్రయోజనానికి ఈ నిధులను ప్రత్యేకించారనే వివరాలు లేవు. కాబట్టి, ఈ నిధులను ఏ ప్రయోజనం కోసం కేటాయించారో, ఆ ప్రయోజనం నెరవేరిందా లేదా అనే విషయాన్ని నిర్ధారించలేకపోతున్నాం.

### 2.4.10 వాస్తవ మిగుళ్ల కంటే అధికంగా నిధులను తిరిగి అప్పగించడం

బడ్జెట్ మాన్యువల్ నిబంధనల (పేరా 20.2.2) ప్రకారం ఏవైనా గ్రాంట్లు/అప్రోప్రియేషన్లలో మిగుళ్లు ఏర్పడతాయని ముందుగానే తెలిస్తే ఆ నిధులను ఖర్చుచేసే శాఖలు అలాంటి మిగుళ్లను ఆర్థిక శాఖకు తిరిగి అప్పగించాలి. ముందుగా ఊహించిన మిగుళ్లను సరెండర్ చేసి ఆ తరవాత సంబంధిత నియంత్రణ అధికారులు మళ్లీ నిధులను ఖర్చు చేయడం వలన ఆయా గ్రాంటు/అప్రోప్రియేషన్‌లలో మొత్తమ్మీద అంతిమంగా ఏర్పడిన మిగులు కంటే అధిక మొత్తాన్ని సరెండర్ చేసినట్లవుతోంది.

పద్నాలుగు కేసుల్లో, వాస్తవంగా మిగిలిన మొత్తం కన్నా తిరిగి అప్పగించిన మొత్తం (ప్రతి కేసులోనూ రూ50 లక్షలు లేదా అంతకు మించి) ఎక్కువగా ఉంది. ఇది ఆయా శాఖల్లో ఆర్థికపరమైన నియంత్రణ లోపించడం లేదా చాలినంత లేకపోవడాన్ని సూచిస్తోంది. ఈ కేసుల్లో వాస్తవంగా ఏర్పడిన మిగుళ్లు ₹ 2,122 కోట్లు కాగా ₹ 2,818 కోట్లను (₹ 429 కోట్లు అధికంగా) సరెండర్ చేసారు. వివరాలు ***అనుబంధం 2.6*** లో ఉన్నాయి.

### 2.4.11 మిగుళ్లను అప్పగించకపోవడం

2010-11 సంవత్సరం ముగిసే నాటికి, 20 గ్రాంట్లు/అప్రోప్రియేషన్లలో మిగుళ్లు ఉన్నప్పటికీ, సంబంధిత శాఖలు వాటిని సరెండరు చేయలేదు. ఈ కేసులలో ఏర్పడిన మిగుళ్లు ₹ 1,248 కోట్లు. ఇవి మొత్తం మిగుళ్లలో (₹ 22,310 కోట్లు) లో 6 శాతం ఉన్నాయి. వివరాలు ***అనుబంధం 2.7*** లో ఉన్నాయి.

అదే విధంగా, 31 గ్రాంట్లు/అప్రోప్రియేషన్ల కింద ₹ 15,449 కోట్ల మిగుళ్లు ఏర్పడగా, ₹ 7,449 కోట్ల మిగుళ్లను (ప్రతీ కేసులోనూ సరెండరు చేయని మిగులు ₹ 5 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ ఉన్నవి) సరెండరు చేయలేదు. మొత్తం మిగుళ్ల (₹ 22,310 కోట్లు) లో ఇవి 33 శాతం ఉన్నాయి. ఈ వివరాలు ***అనుబంధం 2.8*** లో ఉన్నాయి.

అంతేకాకుండా, 55 కేసుల్లో (ప్రతీ కేసులోనూ ₹ 10 కోట్ల కంటే ఎక్కువ నిధులను సరెండరు చేసిన కేసులు), ₹ 10,856 కోట్లు (మొత్తం ₹ 22,310 కోట్ల మిగుళ్లలో 49 శాతం) 2011 మార్చి నెలలోని చివరి రెండు పనిదినాల్లో సరెండరు చేసారు. వివరాలు ***అనుబంధం 2.9*** లో ఉన్నాయి. ఆర్థిక నియంత్రణ చాలినంతగా లేదనీ, వ్యయ సామర్థ్యం చాలా తక్కువగా ఉందనీ దీన్నిబట్టి స్పష్టమవుతోంది.

### 2.4.12 హడావిడి ఖర్చులు

ఖర్చులు ఏడాది పొడవునా సమంగా ఉండాలనీ, ఏదైనా అప్రోప్రియేషన్ మురిగిపోకుండా ఉండేందుకు మార్చి నెలలో అనవసరపు హడావిడి ఖర్చులు చేయకూడదనీ ఫైనాన్షియల్ కోడ్ లోని 39 వ అధికరణం నిర్దేశిస్తోంది.

ఐతే, ఈ నిబంధనలకు విరుద్ధంగా, 2010 డిసెంబరుతో ముగిసిన మొదటి మూడు త్రైమాసికాలలో, ఒక్కొక్క త్రైమాసికం లోనూ చేసిన ఖర్చు మొత్తం ఖర్చు ₹ 89,657 కోట్లు (రెవెన్యూ, క్యాపిటల్ రెండు విభాగాల్లో కలిపి) లో 16 నుండి 25 శాతం వరకు ఉండగా, చివరి త్రైమాసికంలో మాత్రం ఇది 35 శాతం ఉంది. 2011 మార్చి నెలలోనే మొత్తంలో 21 శాతం ఖర్చయ్యింది. ఆర్థిక సంవత్సరం చివర్లో హడావిడి ఖర్చులు చేసారని దీనిని బట్టి స్పష్టమౌతోంది. ఇదే విషయం కింది చార్టుల నుండి కూడా తెలుస్తోంది.

చార్టు 2.1 : త్రైమాసికం వారీగా ఖర్చు

(₹ కోట్లలో)




చార్టు 2.2 : 2011 మార్చి నెలలో హడావిడి ఖర్చులు

(₹ కోట్లలో)




## 2.5 ప్రధానమైన విధాన నిర్ణయాలు

రాష్ట్ర ప్రభుత్వం 2010-11 సంవత్సరానికి బడ్జెటును ప్రవేశపెడుతూ, సమానత్వాన్ని సాధిస్తూ, ఆర్థిక వృద్ధిని సాధించడమే తమ ప్రధాన లక్ష్యమని ప్రకటించింది. తదనుగుణంగానే, 'అభయ హస్తం' పథకం, 'జాతీయ గ్రామీణ తాగునీటి పథకం', 'రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్' మొదలైన పథకాలకు కేటాయింపులను పెంచాలని ప్రభుత్వం తలచింది.

2010-11 సంవత్సరానికి సంబంధించి పైన పేర్కొన్న రాష్ట్ర ప్రభుత్వ విధాన నిర్ణయాల్లో కొన్నింటి అమలును మచ్చుకు తనిఖీ చేయడమైంది. దీనికి సంబంధించి, ఆడిటు కనుగొన్న విషయాలు ఈ కింది విధంగా ఉన్నాయి :

- తొమ్మిది, పది తరగతుల్లో విద్యార్థుల నమోదు 65 నుండి 100 శాతానికి పెంచడానికీ, ప్రస్తుతం ఉన్న మాధ్యమిక పాఠశాలలను మెరుగుపర్చడానికీ భారత ప్రభుత్వం "రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ (ఆర్.ఎమ్.ఎస్.ఎ.)" అనే కొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది. నాన్-రికరింగ్ గ్రాంటులో రాష్ట్ర వాటా కోసం కేటాయించిన ₹ 190 కోట్లకు గానూ, రాష్ట్ర ప్రభుత్వం ₹ 86 కోట్లను మాత్రమే విడుదల చేసింది. ఐతే, 2010-11 సంవత్సరానికి రాష్ట్రం తన వంతుగా ఇవ్వాల్సిన రికరింగ్ గ్రాంటు ₹ 18 కోట్లను విడుదల చేయలేదు. ఈ పథకం కింద, 1,656 పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, గ్రంథాలయం, విజ్ఞాన శాస్త్ర ప్రయోగ శాల మొదలైనవి నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకోగా, 1,000 (60 శాతం) పాఠశాలల్లో వీటి నిర్మాణం పూర్తయ్యింది. పథకంలోని అంశాల్లో ఒకటైన 'సర్వీసులో ఉన్న టీచర్లకు శిక్షణ' ను బడ్జెటు విడుదల కాకపోవడంతో అమలు చేయలేకపోయారు.
- వయోజన మహిళల్లో నిరక్షరాస్యతను రూపుమాపడానికి 'సాక్షర భారత మిషన్ - 2012' అనే ఒక కొత్త కేంద్ర ప్రాయోజిత పథకాన్ని ప్రభుత్వం అమలు చేసింది. ₹ 30 కోట్ల బడ్జెటు కేటాయింపులకుగానూ ₹ 23 కోట్లను మాత్రమే ప్రభుత్వం విడుదల చేసింది. 15 లక్షల మంది వయోజన మహిళలకు కనీస విద్య నేర్పాలనేది లక్ష్యం కాగా, 10.46 లక్షల మంది వయోజన మహిళలకు మాత్రమే నేర్పారు.

- గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతీ వ్యక్తికీ సరిపడేంత తాగునీటి సదుపాయాన్ని కల్పించాలనే లక్ష్యంతో "జాతీయ గ్రామీణ తాగునీటి పథకం" అనే కొత్త పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. మొత్తం ₹ 220 కోట్ల బడ్జెటు కేటాయింపులకు గానూ, ₹ 87.96 కోట్లను విడుదల చేసి, ఆ మొత్తాన్ని ఖర్చుగా నమోదు చేయడం జరిగింది. ఐతే, ₹ 17.95 కోట్లు (8 శాతం) మాత్రమే పథకంపై వాస్తవంగా ఖర్చయ్యింది. మిగిలిన ₹ 70 కోట్లు రాష్ట్ర నీటి సరఫరా మిషన్ పి.డి. అకౌంటులోనే ఉన్నాయి.

- అభయ హస్తం పథకానికి కేటాయించిన మొత్తం ₹ 220 కోట్లనూ డ్రా చేయడం, వినియోగించడం జరిగినప్పటికీ, 83.08 లక్షల మంది సభ్యులకుగానూ 49.20 లక్షల మంది (59 శాతం) సభ్యులకు మాత్రమే లబ్ధి చేకూరింది.

- అదేవిధంగా, రాజీవ్ విద్యామిషన్ కింద అదనపు తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి సదుపాయం మొదలైన 31,323 సివిల్ పనులను పూర్తి చేయాలన్న లక్ష్యానికి గానూ, 20,567 (66 శాతం) పనులు మాత్రమే పూర్తయ్యాయి. 10,663 పాఠశాలలకు ఫర్నీచరు, 25 పాఠశాలలకు బోధన - అధ్యయన పరికరాలను అందజేసే విషయంలో లక్ష్యసాధన 'శూన్యం'. 10,14,824 మందికి సామాజిక శిక్షణ కల్పించడం, 52,66,837 మంది బడి పిల్లలకు యూనిఫామ్‌ల సరఫరా విషయంలో లక్ష్యాలు పూర్తిగా నెరవేరాయి.

- ఎస్సీ, ఎస్టీ, బి.సి., ఇ.బి.సి., వికలాంగ విద్యార్థులకు పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్పులు (పి.ఎమ్.ఎస్.), ట్యూషన్ ఫీజు రీ-ఇంబర్స్‌మెంట్ (ఆర్.టి.ఎఫ్.) కోసం విడుదల చేసిన నిధులను డ్రా చేయడానికి ఆమోదం రాకపోవడం వలనా, నిధులను నిలుపుదల చేయడం వలనా, విడుదలైన నిధులను పూర్తి మొత్తంలో డ్రా చేయడం జరగలేదు. 2010-11 సంవత్సరంలో పి.ఎమ్.ఎస్., ఆర్.టి.ఎఫ్. ల కోసం విడుదల చేసిన నిధుల్లో అధిక భాగం 2009-10 బకాయిల చెల్లింపు కోసమే ఖర్చు చేయడం జరిగింది. బి.సి., ఇ.బి.సి. విద్యార్థులకు సంబంధించి, ట్యూషన్ ఫీజులో 25 శాతం మాత్రమే మంజూరయ్యింది. ఐతే, ఎస్సీ, మైనార్టీ వర్గాల విద్యార్థులకు సంబంధించి పి.ఎమ్.ఎస్., ఆర్.టి.ఎఫ్. ల విషయంలో కేటాయించిన నిధులను పూర్తిగా విడుదల చేయడం జరిగింది.

- ప్రభుత్వం, సాంఘిక భద్రతా పింఛన్ల పథకాన్ని ఎయిడ్స్ రోగులకు కూడా కల్పించాలని నిర్ణయించి, బడ్జెట్లో ₹ 9.60 కోట్లను కేటాయించినప్పటికీ, ఈ ఏడాది నిధులను మాత్రం విడుదల చేయలేదు.

- కల్లు గీత కార్మికులకు పింఛన్ల కోసం డ్రా చేసిన ₹ 23.55 కోట్లకు గానూ, ₹ 6.61 కోట్లను మాత్రమే ఖర్చు చేసి, లక్షమందికిగానూ 33,371 మందికి (33 శాతం) మాత్రమే లబ్ధి చేకూర్చారు.

- ఆంధ్రప్రదేశ్ నీటి సరఫరా, పారిశుద్ధ్య పథకం కోసం బడ్జెట్లో కేటాయించిన ₹ 100 కోట్లకు గానూ ₹ 57 లక్షలు (0.57 శాతం) మాత్రమే డ్రా చేసి, ఖర్చు చేసారు. ఫలితంగా, 2010-11 సంవత్సరంలో 300 ఆవాస ప్రాంతాలకు నీటి సరఫరా, పారిశుద్ధ్య సదుపాయాలను కల్పించాలనే లక్ష్యం నెరవేరలేదు.

- 'నేత కార్మికులకు మంజూరు చేసిన రుణాల మాఫీ' పథకాన్ని 2009-10 సంవత్సరంలో, 'ఒక్కసారికి మాత్రమే' అనే ప్రాతిపదికన ప్రవేశపెట్టడం జరిగింది. 2010-11 బడ్జెట్లో ₹ 312 కోట్ల మొత్తాన్ని కేటాయించినప్పటికీ, ₹ 109 కోట్లను (35 శాతం) మాత్రమే విడుదల చేయడం జరిగింది.

## 2.6 ఆకస్మిక ఖర్చుల నిధి నుండి అడ్వాన్సులు

భారత రాజ్యాంగపు అధికరణాలు - 267(2), 283(2) లలోని నిబంధనలననుసరించి, ఆంధ్రప్రదేశ్ కంటింజెన్సీ ఫండ్ చట్టం - 1957 ప్రకారం రాష్ట్ర ఆకస్మిక ఖర్చుల నిధి (కంటింజెన్సీ ఫండ్) ని ఏర్పాటు చేయడమైంది. ముందుగా ఊహించని అత్యవసరమైన ఖర్చుల కోసం మాత్రమే ఈ నిధి నుండి అడ్వాన్సులను తీసుకోవచ్చు. ఎప్పటికప్పుడు తిరిగి భర్తీ చేసే రీతిలో ₹ 50 కోట్ల నిల్వ ఉండే విధంగా ఈ నిధిని ఏర్పాటు చేయడం జరిగింది. 2010-11 లో ఈ నిధి నుండి ₹ 13.31 కోట్లను

డ్రా చేయగా, అందులో ₹ 1.54 కోట్ల మొత్తాన్ని ఏడాది ముగిసే నాటికి ఆ నిధికి తిరిగి జమచేయలేదు. ఈ ఏడాది కంటింజెన్సీ ఫండ్ నుండి డ్రా చేసిన ₹ 13.31 కోట్లలో, ₹ 8.15 కోట్లు (61.23 శాతం) డిక్రీ చార్జీల చెల్లింపులు. ఈ డిక్రీ చార్జీలు, 2005-10 మధ్యకాలంలో న్యాయస్థానాలు ఇచ్చిన ఆదేశాలకు సంబంధించినవి. ఈ చెల్లింపులకు ప్రభుత్వం 2009-11 మధ్య కాలంలో మంజూరీ నిచ్చింది ***(అనుబంధం 2.10)***. ఈ చెల్లింపు అత్యవసరమైనవిగానీ లేదా ముందుగా ఊహించనవిగానీ కాదు కాబట్టి వీటిని కంటింజెన్సీ ఫండ్ నుండి డ్రా చేయాల్సిన అవసరం లేదు.

## 2.7 బడ్జెటు ప్రక్రియలో లోపాలు

రాష్ట్ర ప్రభుత్వపు బడ్జెటు ప్రక్రియలో ఈ కింది లోపాలను/తప్పులను గమనించడమైంది ః

- **సవరణలను తీసుకోకపోవడం -** బడ్జెట్ ప్రక్రియలోని లోపాలు, తప్పులను ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఏటా ఆర్థిక శాఖకు సూచిస్తూనే ఉన్నారు. ఐతే, మేజర్ హెడ్, మైనర్ హెడ్‌ల జాబితాకు కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్, ఎప్పటికప్పుడు జారీ చేస్తున్న సవరణలను తర్వాత సంవత్సరాల్లోని బడ్జెటు అంచనాల్లో రాష్ట్ర ప్రభుత్వం పొందుపరచడం లేదు. దీనివలన రాష్ట్ర వార్షిక పద్దుల్లో తప్పులకు అవకాశం ఉంది.

- **బడ్జెటు అంచనాల్లో వర్గీకరణను తప్పుగా చేయడం ః** '530 - ప్రధాన పనులు' అనే వివరణాత్మక పద్దును క్యాపిటల్ విభాగం కింద నిర్వహించాల్సి ఉండగా, దాన్ని రెవెన్యూ విభాగం కింద నిర్వహించడం జరుగుతోంది. అదేవిధంగా, 270 - చిన్నతరహా పనులు, 310 - సహాయక గ్రాంట్లు - అనే వివరణాత్మక పద్దులను రెవెన్యూ విభాగం కింద నిర్వహించాల్సి ఉండగా, క్యాపిటల్ విభాగం కింద నిర్వహించడం జరుగుతోంది. ఐతే, ఈ ఏడాది ప్రభుత్వం, క్యాపిటల్ విభాగం కింద చిన్నతరహా పనుల కోసం ₹ 140.06 కోట్లు, రెవెన్యూ విభాగం కింద భారీ పనులకు ₹ 184.84 కోట్ల మొత్తాలను తప్పుగా కేటాయించి, ఖర్చు చేయడం జరిగింది.

## 2.8 సారాంశం

ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వ బడ్జెటు సంబంధిత ప్రక్రియలు సరిగా లేవు. బడ్జెటు రూపకల్పనలో లోపాలు, ఏ ప్రయోజనానికి కేటాయిస్తున్నారనే స్పష్టత లేకుండానే గంపగుత్తగా కేటాయింపులను చేయడం (తర్వాత సరెండరు చేయడానికి మాత్రమే), కేటాయింపులను మించి అధికంగా ఖర్చు చేయడం, బడ్జెటు కేటాయింపులు లేకుండానే ఖర్చు చేసేయడం లాంటివి జరిగాయి. ఏయే అంశాల్లో నిరంతరం మిగుల్లేర్పడుతున్నాయో విశ్లేషించేందుకూ, తగిన దిద్దుబాటు చర్యలు తీసుకోవడానికీ ఎలాంటి ప్రయత్నాలూ జరగలేదు. అవసరానికి మించి నిధులను డ్రా చేయడం, సరైన వివరణలు లేకుండానే రీ-అప్రోప్రియేషన్లు చేయడం, నిధుల కేటాయింపులు లేకపోయినా ఖర్చుపెట్టేయడం ద్వారా పలు శాఖలు 'ఆర్థిక నియమావళి'ని ఉల్లంఘించాయి.

నిధులను విడుదల చేయడం, ఏడాది చివర్లో నిధులను భారీగా సరెండరు చేయడం జరుగుతోంది. నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవడం లేదు కాబట్టి, ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించాల్సి ఉంది. సరైన పర్యవేక్షణ లేకపోవడం, బడ్జెటును నిలుపుదల చేయడం వంటి వాటివలన సాంఘిక రంగంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల విషయంలో, ముఖ్యంగా విద్యారంగంలో ప్రభుత్వం తీసుకున్న ప్రధాన విధాన నిర్ణయాలు ఫలితాలనివ్వలేదు. ఆర్థిక క్రమశిక్షణ లోపించడం వలన కంటింజెన్సీ ఫండ్‌నుండి ఖర్చు చేయడానికి తగిన కారణాలు లేకపోయినా కంటింజెన్సీ ఫండ్ నుండి అడ్వాన్సులను డ్రా చేసేయడం జరిగింది. బడ్జెటు ప్రక్రియ మరింత పారదర్శకంగానూ, ఫలితాలను రాబట్టే విధంగానూ ఉండాలంటే ప్రభుత్వం బడ్జెటు విధానాలనూ, ఆర్థిక నియమావళినీ మరింత పగడ్బందీగా అనుసరించాలి.